సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 31 । మార్చి । 2023

నేడు గ్రాడ్యుయేషన్ వేడుక

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)లో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు గ్రాడ్యుయేషన్ వేడుక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ క్యాంపస్‌లో నైకా సంస్థ సీఈఓ, వ్యవస్థాపకుడు ఫల్గుణినాయర్, ఐఎస్‌బి ఎగ్జిక్యూటివ్ బోర్డు చైర్మన్ హరీష్ మన్వానీ ముఖ్యఅతిథులుగా, ఐఎస్‌బి డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.



కడ్తాల్: స్వామి వారికి భక్తితో నమస్కరిస్తున్న మహిళ



న్యూస్‌రీల్

నూతన ఎన్నిక



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కిరణ్‌కుమార్

మొయినాబాద్: రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రేరియన్ సెక్రటరీగా మండలంలోని అమ్డాపూర్ గ్రామానికి చెందిన అడ్వకేట్ కారుకొండ కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు అసోసియేషన్ ఎన్నికల అధికారి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

ఉపాధ్యాయుల సమస్యలపై సీఎంను కలుస్తా

పీఆర్టీయూ టీఎస్ నేత గుర్రం చెన్నకేశవరెడ్డి



యాచారం: ఉపాధ్యాయుల సమస్యలపై త్వరలో సీఎం కేసీఆర్‌ను కలిసి నివేదిస్తానని పీఆర్టీయూ టీఎస్ నేత గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. తన స్వగ్రామం మొండిగౌరెల్లిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన గెలుపు కోసం పీఆర్టీయూ టీఎస్ శ్రేణులు ఎంతగానో కష్టపడ్డారని తెలిపారు. తన ఓటమికి ఎన్నో కారణాలు ఉన్నాయని, వాటిపై పూర్తి స్థాయిలో సమీక్షించినట్లు చెప్పారు. పీఆర్టీయూ టీఎస్ నుంచి రెండుసార్లు గెలిచిన జనార్దన్‌రెడ్డి రెబల్‌గా మళ్లీ పోటీ చేసి ఓట్లు చీల్చడం, డబ్బు ప్రభావితం చేశాయన్నారు. అయినా ఆందోళన చెందడం లేదని, ఉపాధ్యాయుల సమస్యలే ప్రధాన ఎజెండాగా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని వివరించారు.

ఆస్తిపన్ను చెల్లింపునకు నేడే చివరి రోజు

- రాత్రి 11 గంటల వరకు పనిచేయనున్న సీఎస్‌సీలు
- ఆన్‌లైన్ ద్వారా అర్ధరాత్రి వరకు..



సాక్షి, సిటీబ్యూరో: శుక్రవారంతో ముగియనున్న ఈ ఆర్థిక సంవత్సరం (2022-23) ఆస్తిపన్ను చెల్లించాల్సిన వారి సదుపాయార్థం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని సర్కిళ్లలోని సిటిజన్ సర్వీస్ సెంటర్లు(సీఎస్‌సీ) రాత్రి 11 గంటల వరకు పనిచేయనున్నాయి. ఆన్‌లైన్ ద్వారా అర్ధరాత్రి 12గంటలలోపు చెల్లించవచ్చని జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లు గణనీయంగానే జరుగుతున్నప్పటికీ, పెరిగిన దుబారా ఖర్చులు.. ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారుల ఆడంబరాలు, వివిధ ప్రాజెక్టుల పనులు తదితరమైన వాటితో ఎన్ని కోట్ల రూపాయలు వసూలవుతున్నా ఖజానా పరిస్థితి లోటుగానే ఉంటోంది. గతంలో రూ.వెయ్యి కోట్లు వసూలు కావడమే గగనమనుకున్న పరిస్థితి నుంచి ఏటా టార్గెట్‌ను పెంచుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సర టార్గెట్ రూ.2వేల కోట్లు కాగా, ఫిబ్రవరి నెలాఖరు వరకు రూ.1,514 కోట్లు వసూలయ్యాయి. మార్చినెల ఒకటి నుంచి 30వ తేదీ సాయంత్రం వరకు దాదాపు రూ.88 కోట్లు వసూలయ్యాయి. వెరసీ రూ.1,602 కోట్లు వసూలయ్యాయి. చివరి రోజు గరిష్ట వసూళ్లు చేసేందుకు సీఎస్‌సీలను 11 గంటల వరకు తెరచి ఉంచనున్నారు. ఆన్‌లైన్ ద్వారా అర్ధరాత్రి 12గంటలలోపు చెల్లించవచ్చు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కోరుతోంది. ఇప్పటికే వివిధ రూపాల్లో, వివిధ మార్గాల్లో ఎక్కువే వసూలు చేశారు. చివరి రోజు దాదాపు రూ.100 కోట్ల వసూలు ఆశలున్నా.. కష్టమేననే అభిప్రాయాలున్నాయి. గతేడాది రూ.1,495 కోట్ల ఆస్తిపన్ను వసూలు కాగా, చివరి ఒక్కరోజు దాదాపు రూ.94 కోట్లు వసూలయ్యాయి.

అంతా రామమయం



ఆమనగల్లు: కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీరామనవమి వేడుకలను గురువారం జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఊరూవాడా శ్రీరామ నామ స్మరణతో, భక్తిగీతాలతో మార్మోగిపోయాయి. భక్తజన సందోహం మధ్య రాములవారి కల్యాణాన్ని వేదపండితులు వైభవంగా జరిపించారు. ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల శ్రీరాముడి శోభాయాత్రలు నిర్వహించారు.



ఇబ్రహీంపట్నం: తాళిబొట్టును భక్తులకు చూపిస్తున్న పూజారి



కందుకూరు: తిమ్మాపూర్‌లో పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కడ్తాల్: స్వామివారి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు



షాబాద్: సీతారాంపూర్‌లో స్వామివారి ఊరేగింపు

రాళ్లు వేసి.. మట్టితో నింపి..

ఎఫ్‌టీఎల్, శిఖం భూముల్లో యథేచ్ఛగా కబ్జాలు

- రాత్రికిరాత్రే పెద్దపెద్ద రాళ్లు, మట్టితో నింపుతున్న వైనం
- మృత్యువాతపడుతున్న చేపలు.. పశుపక్ష్యాదులు
- ఆందోళనలో మత్స్యకారులు, ఆయకట్టు రైతులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

ఇది కుంట్లూరులోని చారిత్రక పెద్ద చెరువు. సర్వే నంబర్ 185లో సుమారు 95.02 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించింది. ఇప్పటికే 43.08 ఎకరాలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం 51.21 ఎకరాలే మిగిలింది. ఎల్బీనగర్ చౌరస్తాలో ఇప్పటికే మూసివేసిన సిరిస్ కంపెనీ ఆవరణలోని మట్టితో చెరువును నింపుతున్నారు. చేపలు మృత్యువాతపడి, మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటోంది.





ఇది అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట రెవెన్యూ పరిధిలోని ఈదుల చెరువు. సుమారు 80 ఎకరాల వరకు విస్తరించి ఉంది. ఇటీవల మునుగనూరు మల్లన్నగుట్ట కత్వ, అంబర్‌పేట మధ్యలోని ఎఫ్‌టీఎల్ భూమిలో స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి మట్టినింపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు దర్జాగా కబ్జా చేస్తున్నారు. చెరువులు, వాగులు, కుంటలు ఏదీ వదలడం లేదు. ప్రస్తుతం ఎండలు రోజురోజుకూ పెరుగుతుండడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. చెరువులు, కుంటల్లో నీరు ఇంకిపోయి ఎఫ్‌టీఎల్, శిఖం భూములు బయటపడుతున్నాయి. వీటిపై కన్నేసిన కొంతమంది రియల్టర్లు ఇదే అదనుగా రాత్రికి రాత్రే వరద కాల్వలు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని శిఖం భూములను రాళ్లు, మట్టితో నింపి చదును చేస్తున్నారు. చెరువు ఆనవాళ్లు లేకుండా చేసి చెరబట్టేస్తున్నారు. జిల్లాలో 2,132 చెరువులు, కుంటలు ఉండగా, 10,946 ఎంఎఫ్‌టీ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటిలో ఏటా రూ.1.20 కోట్ల చేపపిల్లలను వదులుతుండగా, ఏటా 400 టన్నులకుపైగా చేపల దిగుబడి వస్తోంది. ప్రమాదకరమైన రసాయనాలు, మట్టితో వీటిని నింపుతుండటంతో చేపలు మృత్యువాతపడి, మత్స్యకారులకు ఉపాధి అవకాశం లేకుండా పోతోంది.

చూసీచూడనట్లు అధికారుల తీరు..

చెరువులకు ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అడ్డగోలుగా నిరభ్యంతర పత్రాలు జారీ చేస్తూ వెంచర్ల ఏర్పాటుకు సహకరిస్తున్నారు. స్థానిక రైతులు, మత్స్యకారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. హడావుడి చేసి ఆ తర్వాత విస్మరిస్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- తుర్కయంజాల్‌లోని చారిత్రక మాసబ్ చెరువు 499 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించింది. దీనిలో 320 ఎకరాల శిఖం భూమి ఉంది. సర్వే నంబర్ 205లోని సుమారు రూ.300 కోట్ల విలువ చేసే భూములపై రియల్టర్ల కన్ను పడింది. 12 ఎకరాలకు 2016లోనే ఎన్‌ఓసీ జారీ చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ భూమిలో ఐదు నుంచి ఏడు ఫీట్ల లోతు నీరు నిల్వ ఉంది. రసాయన పరిశ్రమ నుంచి తవ్విన మట్టితో చెరువును పూడ్చుతుండటంతో చేపలు మృత్యువాతపడుతున్నాయి.
- జల్‌పల్లిలోని పెద్ద చెరువు (ఇబ్రహీంసాగర్) సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువులో నీరు తగ్గుముఖం పట్టడంతో కబ్జాదారులు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములపై కన్నేశారు. రాత్రికి రాత్రే పెద్దపెద్ద బండరాళ్లు తెచ్చి నింపేస్తున్నారు. అడ్డుకోవాల్సిన నీటిపారుదలశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.
- నాదరగుల్ సమీపంలోని సున్నం చెరువు అలుగుకు రంధ్రాలు చేసి నీటిని బయటికి పంపిన రియల్టర్లు తాజాగా ఎఫ్‌టీఎల్ పరిధిలో రసాయనాలతో కూడిన మట్టిని నింపుతున్నారు. మట్టిలోని రసాయనాలు నీటిలో కలిసి చేపలు మృత్యువాత పడుతుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.
- కందుకూరు మండలం గూడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 5లో పూచర్లకుంట ఎఫ్‌టీఎల్ సహా కట్ట, అలుగు, తూము ఉన్న ప్రాంతాలను రియల్టర్లు కబ్జా చేశారు. ఫాం లాండ్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఇటీవల స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఆ మట్టి నిండా విష పదార్థాలే..

ఎల్బీనగర్ చౌరస్తాలో పాత సిరీస్ కంపెనీ స్థలాన్ని ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కొనుగోలు చేసింది. ఇటీవల ఈ ప్రాంగణంలో సెల్లార్ తవ్వకాలు ప్రారంభించింది. నిజానికి ఈ మట్టి ఎందుకూ పనికిరాదు. మట్టినిండా విషరసాయనాలే. జన సంచారం లేని ప్రాంతాల్లో ఈ మట్టిని పారబోయాలి. కానీ సదరు రియల్టర్ సహా సెల్లార్ కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తులు ఈ మట్టితో సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. ఇక్కడ మైనింగ్‌కు అనుమతి తీసుకున్నారు. మట్టిని లారీలో ఎత్తి ఇతర ప్రాంతాలకు తరలిస్తే రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. సెల్లార్ కాంట్రాక్టర్ ఇవేవీ పట్టించుకోకుండా రాత్రికిరాత్రే గుట్టుగా కుంట్లూరు సమీపంలోని పెద్ద చెరువు, పెద్ద అంబర్‌పేట సమీపంలోని ఈదులకుంట, నాదర్‌గుల్ సమీపంలోని సున్నం చెరువులకు తరలించి ఎఫ్‌టీఎల్ భూముల్లో నింపేస్తున్నారు. ఈ మట్టి నిండా ప్రమాదకర విషపదార్థాలు నిల్వ ఉండటంతో అవి చెరువుల్లోకి చేరి జీవరాశుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు విషయం తెలిసీ కిమ్మనకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో వంద ఎకరాలలోపు, పైగా ఉన్న చెరువులు, కుంటలు

చెరువు	డివిజన్-1	డివిజన్-2	చేవెళ్ల	షాద్‌నగర్	కల్వకుర్తి
100కుపైగా	60	376	203	28	18
100 లోపు	732	-	-	432	280
సామర్థ్యం	6,046.28	1,104	913	1,322.22	1,560.9
ఆయకట్టు	31,936.28	7,850	6,845	13,265.23	10,170.28

అదాని.. మోదీ బినామీ



టంగటూరు-మోకిల గ్రామాల మధ్య మూసీ నదిపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

- దేశాన్ని దోచి అదానికి కట్టబెడుతున్న ప్రధాని
- ప్రశ్నించేవారిని కేసులతో వేధింపులు
- పథకాల అమలు ఘనత మాదే
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- శంకర్‌పల్లిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

శంకర్‌పల్లి: ప్రపంచంలోనే అత్యంత అవినీతిపరుడు ప్రధాని నరేంద్ర మోదీ అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. దేశాన్ని దోచి అదానికి కట్టబెడుతున్నారని, అదాని మోదీ బినామీ అని దుయ్యబట్టారు. గురువారం శంకర్‌పల్లి మండలం టంగటూరు-మోకిల గ్రామాల మధ్య మూసీవాగుపై రూ.12.90 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన వంతెన నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే.. టంగటూరులో అదనపు తరగతి గదులను, రూ.90లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు అదాని ఆస్తులు రూ.50వేల కోట్లుంటే.. ప్రస్తుతం 12లక్షల కోట్లకు ఎలా ఎదిగాడని ప్రశ్నించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే నాయకులను వ్యవస్థలను అడ్డుపెట్టుకొని వేధిస్తున్నారని విమర్శించారు. ఇటీవల మొయినాబాద్ మండలంలో నలుగురు ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ చేసిన ప్రయత్నం బెడిసికొట్టిందని, తమ బండారం బయటపడినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్సీ కవితపై అనేక కేసులు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తలాతోక లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీ నియంత పాలనకు చరమగీతం పాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

మూసీపై ఆరు వంతెనలు

అనేక సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి వేముల అన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో లేవన్నారు. మూసీ నదిపై ఆరు వంతెనలు నిర్మిస్తున్నామని తెలిపారు. మన ఊరు-మన బడి కార్యక్రమంతో మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని తెలిపారు. పంచాయతీ భవనాలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలను ఎంతో గొప్పగా తీర్చిదిద్దామని, ఈ ప్రగతి ప్రతిపక్ష నేతలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని, తాను ఏదడిగినా ముఖ్యమంత్రి ఇస్తున్నారని చెప్పారు. పొద్దటూరు-ప్రగతి రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలే అధికం

- డీజీపీ అంజనీకుమార్

బంజారాహిల్స్/హైదరాబాద్: ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో సైబర్ నేరాలే ఎక్కువగా ఉంటున్నాయని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం ఐటీ విభాగానికి చెందిన 41 మంది జ్యుడీషియల్ ఆఫీసర్లు, 100 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సైబర్ నేరాలు, సైబర్ చట్టాలపై నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయరంగంలో సైబర్ సంసిద్ధతను పొందాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరస్తులు విసురుతున్న సవాళ్లను మంచి పరిజ్ఞానంతో ఎదుర్కోవడానికి ఏజెన్సీలు, న్యాయ వ్యవస్థ ముందుకు రావాలని సూచించారు. సైబర్ క్రైం, డేటా పాయింట్లు, పరిశోధన, విధానపరమైన అవసరాలు, పరిష్కారాలు, దేశంలో ఇప్పటికే ఉన్న సైబర్ చట్టాలు తదితర అంశాలపై శిక్షణ కొనసాగింది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ జ్యుడీషియల్ ఆఫీసర్ సామర్థ్యాలు పెంపొందించడం, సైబర్ నేరాల కేసులను మరింత సమర్థవంతంగా, ప్రభావవంతంగా పరిశోధించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డీజీ బెనహర్ మహేష్ దత్ ఎక్కా, సీఐడీ అదనపు డీజీ మహేశ్‌భగవత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీజీపీ అంజనీకుమార్

భానుడు భగభగ @ 40 డిగ్రీలు

సాక్షి, సిటీబ్యూరో: భానుడు భగ్గుమంటున్నాడు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం తల్లడిల్లుతున్నారు. భానుడి ప్రతాపంతో మధ్యాహ్నం గడపదాటేందుకు భయపడిపోతున్నారు. శ్రీరామనవమి పండగ సందర్భంగా ఆలయాలకు వెళ్లిన భక్తులు ఎండతో ఉక్కిరిబిక్కిరయ్యారు. రాగల రెండు రోజులు ఎండలు ఇదే మాదిరిగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గురువారం సాధారణ గరిష్ట ఉష్ణోగ్రతలు 37.4 డిగ్రీలు ఉండగా, పలుచోట్ల 40 డిగ్రీల చేరువలో నమోదయ్యాయి. తిరుమలగిరిలో అత్యధికంగా 39.6 డిగ్రీలు, గచ్చిబౌలిలో 39.3, కుర్మగూడలో 39.1 డిగ్రీలు నమోదయ్యాయి. జూబ్లీహిల్స్‌లో 38.9, అత్తాపూర్‌లో 38.7, రెడ్‌హిల్స్, బాలాజీనగర్‌లో 38.4, మారుతీనగర్, అడ్డగుట్టలో 38.3, మియాపూర్‌లో 38.2, వెస్ట్ మారేడపల్లిలో, షేక్‌పేట ఎల్బీనగర్‌లో 381, విరాట్‌నగర్, గోల్కొండ, న్యూనాగోల్, ఐఎస్ సదన్‌లో 38 డిగ్రీలున్నాయి.

శ్రీరామనవమి వేడుకలో అపశ్రుతి



టెంటు కూలడంతో సొమ్మసిల్లి పడిపోయిన అనుసుజా



క్షతగాత్రులను పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ

- టెంటు కూలి ముగ్గురికి తీవ్ర గాయాలు
- పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలింపు

షాబాద్: మండలంలోని సీతారాంపూర్‌లో గురువారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆలయంలో భక్తుల కోసం వేసిన టెంటు సుడిగాలికి కూలిపోయింది. దీంతో టెంటు రాడ్లు పడి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చందనవెల్లి గ్రామానికి చెందిన అనుసుజాకు తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. పోతుగల్ గ్రామానికి చెందిన అండాలు తలకు, భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మరావుగూడకు చెందిన బుచయ్యకు రక్త గాయలు అయ్యాయి. మరికొంత మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు.క్షతగాత్రులను షాబాద్ సీఐ గురువయ్య గౌడ్, ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

శ్రీరామ నవమి ఉత్సవాల్లో కిషన్‌రెడ్డి

కందుకూరు: మండలంలోని తిమ్మాపూర్‌లో గురువారం నిర్వహించిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాచులూరు కోదండ రామస్వామి ఆలయంలో ఇండియా వాలీబాల్ మాజీ కెప్టెన్, అర్జున్ అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ ఎం జ్యోతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బీ నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏ శ్రీరాములు యాదవ్, కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అమరేందర్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



కల్యాణ వేడుకలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

నందిగామ మండలం గుడి మామిడిపల్లి సీతారాముల ఆలయంలో గురువారం నిర్వహించిన స్వామి అమ్మవారి కల్యాణ వేడుకలో రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ పాల్గొన్నారు. సీతారాముల కల్యాణంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, ఎంపీపీ రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

- నందిగామ



బాలిక అదృశ్యం

రాజేంద్రనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక కనిపించుండాపోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఖాజాపాషా తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం సంవత్సరం క్రితం కిస్మత్‌పూర్ సాయిబాబా కాలనీకి వలస వచ్చింది. వీరికి 17 సంవత్సరాల కూతురు ఉంది. కర్ణాటకలో ఉన్న సమయంలో స్థానికంగా ఉన్న ఓ యువకుడితో బాలిక చనువుగా ఉండేది. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు స్థానిక ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా జాడ తెలియకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణాటకలోని బాలికతో చనువుగా ఉండే యువకుడు సైతం కనిపించడం లేదని అతడిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



అంకిత్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బీహార్‌కు చెందిన హన్స్‌లాల్ బైటా కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చి దేవరయాంజాల్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అతడి భార్య ఆరోగ్యం సరిగా లేకపోవడంతో అతని ఇద్దరి పిల్లలు ప్రియాంక (05), అంకిత్ (03) లను ఇంటి వద్దే వదలి కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రికి వెళ్లారు. ఇంటి ముందు ఆడుకుంటున్న అంకిత్ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి పోయాడు. తమ్ముడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిస్తున్న ప్రియాంక ఏడుపు విని అక్కడికి వచ్చిన రామకృష్ణ అనే వ్యక్తి నీటి సంపులో పడిన బాలుడిని గుర్తించి బయటికి తీసి ఆర్క్ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి హన్స్‌లాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహారపు అలవాట్లతో ఆరోగ్య రక్ష

- వెల్లడించిన మహిళా ఆరోగ్య నిపుణులు
- ఆయుర్వేదం– న్యూట్రిషనల్ సైన్స్‌పై చర్చ



సాక్షి, సిటీబ్యూరో: వయసుతో సంబంధం లేని చురుకుదనం ఆరోగ్యాలను అందుకోవడంలో ఆహారపు అలవాట్లే ప్రధానమని పలువురు మహిళారోగ్య నిపుణులు స్పష్టం చేశారు. ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా ఆధ్వర్యంలో గురువారం తాజ్ డెక్కన్ హోటల్‌లో 'ఆయుర్వేద –న్యూట్రిషనల్ సైన్స్–ఆరోగ్యం' అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా గత దశాబ్దకాలంలో భారతీయ ఆహార అభిరుచిలో వస్తోన్న మార్పులపై ప్యానలిస్టులు చర్చించారు. విదేశీ వంటకాలపై వ్యామోహంతో అల్ట్రా ప్రాసెస్డ్, హై కేలరీ ఫుడ్స్ వినియోగం పెరిగిందన్నారు. స్నాక్స్‌కు బదులుగా సంప్రదాయ, రుచికరమైన బాదాములు, మిల్లెట్స్, ఉసిరికాయ, రెడ్ రైస్ వంటివి తీసుకోవాల్సిందిగా సూచించారు. మన నమ్మకాలు, ఆయుర్వేద సూత్రాలతో సమకాలీన న్యూట్రిషనల్ సైన్స్ ఏకీభవిస్తున్న వైనాన్ని విశ్లేషించారు. వటడ/బాద్మా / వత్మా అని పేర్కొనే బాదాముల వల్ల 'వత', 'పిత్త' 'కఫ' దోషాలు తగ్గుతాయని ఆయుర్వేదం చెబుతోందని, ఇటీవల డేవిడ్ సీ నీమన్ నిర్వహించిన అధ్యయన ఫలితాల ప్రకారం, బాదాముల వల్ల మజిల్ రికవరీతో పాటు వ్యాయామాల అలసట కూడా తగ్గుతుందని వెల్లడైందన్నారు. ఈ నేపథ్యంలో ఆయుర్వేద విజ్ఞానాన్ని సమకాలీన న్యూట్రిషనల్ సైన్స్‌తో జోడించడం తప్పనిసరిగా స్పష్టం చేశారు. చక్కటి ఆరోగ్య నిర్వహణకు ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు పాటించడం తప్పదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఆయుర్వేద నిపుణురాలు డాక్టర్ నిఖిత కోహ్లీ, న్యూట్రిషన్– వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి ఫిట్‌నెస్ ట్రైనర్ కిరణ్ డెంబ్లాలు పాల్గొన్నారు.

పార్కు కబ్జాకు యత్నం

రాజేంద్రనగర్: 30 కోట్ల విలువైన జీహెచ్‌ఎంసీ పార్కు స్థలాన్ని కొందరు గురువారం ఉదయం ప్రహారీని కూల్చి చదును చేశారు. స్థానిక కాలనీ వాసులు అడ్డుకొని పోలీసులకు, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిందితులు పారిపోయారు. పోలీసులు బీఎండబ్ల్యూ కారుతో పాటు రెండు జేసీబీలు, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. బీఎండబ్ల్యూ, బొలేరో వాహనంపై శివారుకు చెందిన ఎమ్మెల్యే స్టికర్ ఉండడం గమనార్హం. శాస్త్రీపురం ప్రాంతంలో 1988లో హెచ్‌ఎండిఏ ద్వారా మొట్టమొదటి శాస్త్రీపురం సోసైటీ లేఅవుట్‌ను చేపట్టారు. ఈ లేఅవుట్‌లో 13 పార్కులను ఏర్పాటు చేసి జీహెచ్‌ఎంసీకి అప్పగించారు. కాలనీలోని చర్చి, ప్రార్థనా మందిరం ఎదురుగా 1.30 ఎకరాల స్థలంలో పార్కు స్థలం ఉంది. దీన్ని చుట్టూ జీహెచ్‌ఎంసీప్రహారీని నిర్మించి మొక్కలను నాటి గార్డెన్‌ను నిర్వహిస్తోంది. దాదాపు 30 కోట్ల విలువైన ఈ స్థలాన్ని గురువారం ఉదయం కొందరు జేసీబీలు, టిప్పర్లతో వచ్చి చదును చేయడం ప్రారంభించారు. గంట వ్యవధిలో మొత్తం పార్కు ప్రహారీని కూల్చి చదును చేశారు. తెల్లవారుజామున 5 గంటలకే ఈ పనులు నిర్వహించడంతో స్థానికులు అడ్డుకోని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోగానే నిందితులు పారిపోయారు. విషయాన్ని రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శాస్త్రీపురం సోసైటీ సభ్యులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పట్టించుకోని జీహెచ్‌ఎంసీ...

హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో మొట్టమొదటి లేఅవుట్ శాస్త్రీపురంలో 1988లో చేపట్టారు. దీంతో పాటు బుద్వేల్‌లో జనచైతన్య హౌసింగ్ సోసైటీ వెంచర్‌ను, మైలార్‌దేవ్‌పల్లిలో టీఎన్‌జీవోస్ హౌసింగ్ సోసైటీలు చేపట్టింది. ఈ మూడు స్థలాల్లో దాదాపు 50 పార్కులను రిజిస్ట్రేషన్ చేసి జీహెచ్‌ఎంసీకి అప్పగించారు. రోజు రోజుకూ ఈ స్థలాల విలువ పెరుగుతుండడంతో కబ్జాదారులు వీటిని కబ్జాలు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 20 పార్కులు కబ్జా అయినట్లు తెలుస్తోంది. పార్కుల నిర్వహణను జీహెచ్‌ఎంసీ పట్టించుకోకపోవడంతో విలువైన పార్కులు కబ్జాలకు గురవుతున్నాయి. స్థానికులు ఫిర్యాదులు చేయడం, అనంతరం కబ్జాదారులు భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో స్థానికులు వెనుకడుగు వేస్తున్నారు. ఇదే సమయంలో కబ్జాదారులు జీహెచ్‌ఎంసీ అధికారులతో ములాకత్ అయి కబ్జాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరీక్షలు రాసిన విద్యార్థులకు వండర్ లా ప్రత్యేక వినోదం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ప్రసిద్ధ అమ్యూజ్‌మెంట్ పార్క్ వండర్‌లా ఈ విద్యా సంవత్సరంలో తమ 10, 11, 12వ తరగతి బోర్డు పరీక్షలకు హాజరైన విద్యార్థుల కోసం ప్రత్యేక వినోదాన్ని అందిస్తోంది. అంతేకాకుండా తమ ఒరిజినల్ హాల్ టిక్కెట్లను చూపడం ద్వారా విద్యార్థులు ప్రవేశ టికెట్ల పై 35% రాయితీని కూడా ఇస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

బంగారం పట్టివేత

శంషాబాద్: ఓ ప్రయాణికుడు అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గురువారం కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబాయ్ నుంచి మస్కట్ మీదుగా నగరానికి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అతడి వద్ద 224 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ రూ. 13.72 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మక్కా, రాయల్ మసీదుల్లో ఏర్పాట్లు పూర్తి

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్న మక్కా, రాయల్ (పబ్లిక్ గార్డెన్స్) మసీదుల్లో రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహ్మద్ ఇల్యాస్ అహ్మద్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు గాను ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక షెడ్లు ఏర్పాట్లు చేశామన్నారు. మక్కా మసీదులో వజూ చేసుకునేందుకు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఆయా మసీదులకు ప్రతిరోజూ వేల సంఖ్యలో భక్తులు వస్తారని, వీరికి ఇఫ్తార్ కోసం ప్రభుత్వం తరఫున ఖర్జూరాలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. రెండు మసీదుల్లో మహిళలు నమాజ్ చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మసీదులోని వజూ ఖానాలు మరుగుదొడ్ల శుభ్రతకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని ఆయన వివరించారు.

దేశంలో కార్పొరేట్ పాలన

కవాడిగూడ: దేశాన్ని తొమ్మిదేళ్లుగా పాలించేది ప్రధాని మోదీ కాదని.. అదానీ, అంబానీల కార్పొరేట్ శక్తులని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అనురాధ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీని అడ్డం పెట్టుకొని అదానీ, అంబానీ వారి సంపదను పెంచుకునేందుకు కార్మిక హక్కులను కాలరాస్తున్నారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెంలో ఏప్రిల్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులకు రక్షణగా ఉన్న కార్మిక చట్టాలను సవరించి కార్పొరేట్ శక్తులకు సానుకూలం చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలకు ఫలితంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో వంద శాతం విదేశీ ప్రత్యేక పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) చట్టబద్ధత కల్పిస్తుందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని తీసుకువస్తుందన్నారు. త్యాగాలు చేసిన సాధించుకున్న కార్మిక హక్కులను కాపాడుకోవడానికి కార్మిక లోకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

డా. నాగేశ్వర్‌రెడ్డికి రోటరీ 'చరక' పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డికి చెన్నైలోని రోటరీ క్లబ్ ఆఫ్ గిండీ పురస్కారం లభించింది. వైద్య రంగంలో నిష్ణాతులకు అందించే చరక పురస్కారాన్ని ఆయనకు రోటరీ క్లబ్ అందజేసింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఎస్.రమేష్‌బాబు మాట్లాడుతూ వైద్యసేవల ద్వారా డా.నాగేశ్వర్ రెడ్డి ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకుని అంతర్జాతీయంగా పేరొందారని కొనియాడారు. ఆయన తాము అందించిన పురస్కారాన్ని స్వీకరించడం తమకు గర్వకారణంగా భావిస్తున్నామన్నారు.

సొంత వాహనాలే.. సో బెటర్..

వ్యక్తిగత వాహనాలపైనే నగరవాసుల ఆసక్తి



- గ్రేటర్‌లో 78 లక్షలు దాటిన వాహనాలు
- సుమారు 50 లక్షల వరకు బైక్‌లే..
- జీవితకాల పన్ను, త్రైమాసిక పన్నుల్లోనూ టాప్
- రూ.3,600 కోట్లకు పైగా ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో సొంత వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటి వరకు సుమారు 78 లక్షల వాహనాలు నమోదయ్యాయి. కోటిన్నరకు చేరుకున్న నగర జనాభాలో సగానికిపైగా వాహనాలు ఉన్నాయి. బైక్‌ల సంఖ్య బాగా పెరిగింది. ఆ తర్వాత వ్యక్తిగత కార్ల వినియోగం కూడా బాగానే నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్టీఏ గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి 53 లక్షల వాహనాలు నమోదు కాగా, అందులో సగానికి పైగా గ్రేటర్ హైదరాబాద్‌కు చెందినవే కావడం గమనార్హం. ఉద్యోగ, వ్యాపార అవసరాల దృష్ట్యా నగరవాసులకు సొంత వాహనం తప్పనిసరిగా మారింది.

ఈ మూడేళ్లలోనే..

కోవిడ్ కాలంలో ప్రజారవాణా స్తంభించిన సమయంలో మొదలైన వాహనాల కొనుగోళ్లు అప్పటి నుంచి అదే ఒరవడిలో కొనసాగుతున్నట్లు రవాణా అధికారులు అంచనా వేస్తున్నారు. వాటిలోనూ బైక్‌లే పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాల్లో కార్ల వినియోగం పెరిగింది. సాధారణంగా ప్రతి సంవత్సరం లక్ష నుంచి 1.25 లక్షల వరకు వాహనాలు కొత్త వాహనాలు వచ్చి చేరుతాయి. మూడేళ్లుగా ఏటా సుమారు 2 లక్షల వరకు కొత్త వాహనాలు నమోదవుతున్నాయి. ఈ మూడేళ్లలోనే వాహనాల సంఖ్య 72 లక్షల నుంచి 78 లక్షలకు పెరిగినట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు.

తప్పనిసరిగా సొంత బండి..

- సొంత బండి ప్రతి ఇంటికీ తప్పనిసరిగా మారింది. రోజురోజుకూ నగరం విస్తరిస్తోంది. అవుటర్‌ను దాటి పెరిగింది. కానీ ఇందుకు తగినట్లుగా ప్రజారవాణా సదుపాయాలు మాత్రం విస్తరించలేదు. దీంతో నగరానికి దూరంగా ఉండి, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం రాకపోకలు సాగించేవాళ్లు సొంత వాహనాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.
- గతంలో ఘట్‌కేసర్, హయత్‌నగర్, మియాపూర్, బీహెచ్‌ఈఐఎల్, కీసర వంటి దూరప్రాంతాల నుంచి నగరానికి వచ్చేవారు సిటీ బస్సులపై ఆధారపడేవాళ్లు. కానీ ఇప్పుడు శివార్ల నుంచి కూడా ఎక్కువ మంది సొంత వాహనాల్లోనే నగరానికి వస్తున్నారు.
- ప్రతిరోజూ సుమారు 4 లక్షల మందికి మెట్రో రైలు సేవలు అందజేస్తున్నప్పటికీ మెట్రో మార్గాలకు ఫీడర్ సర్వీసులు లేకపోవడం వల్ల సొంత వాహనాలపైనే మెట్రో స్టేషన్లకు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

మొబైల్ ఫోన్ ఉన్నట్లే బైక్..

- ఇప్పుడు ప్రతి మనిషికి ఒక మొబైల్ ఫోన్ అనివార్యమైంది. అదేవిధంగా యువతలో 80 శాతం మందికి బైక్ కూడా తప్పనిసరిగా మారింది. చదువు, ఉద్యోగ, వ్యాపార అవసరాలతో నిమిత్తం లేకుండా ఒక వయస్సుకు రాగానే పిల్లలకు బండి కొనివ్వడాన్ని తల్లిదండ్రులు గొప్పగా భావిస్తున్నారు. రవాణాశాఖలో నమోదైన 78 లక్షల వాహనాల్లో సుమారు 50 లక్షల వరకు బైక్‌లే కావడం ఇందుకు నిదర్శనం.
- కుటుంబ అవసరాల కోసం బస్సులు, రైళ్ల కంటే సొంత వాహనాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో ప్రస్తుతం నగరంలో 23 లక్షలకు పైగా వ్యక్తిగత కార్లు నమోదయ్యాయి.
- ఆటోరిక్షాలు, క్యాబ్‌లు, సరుకు రవాణా వాహనాలు, స్కూల్ బస్సులు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు తదితర కేటగిరీలకు చెందినవి సుమారు 5 లక్షల వరకు ఉన్నాయి.

పెరిగిన ఆర్టీఏ ఆదాయం

ఈ ఏడాది రవాణాశాఖ లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని ఆర్జించింది. కొత్తవాహనాలపైన జీవితకాల పన్ను రూపంలో, రవాణా వాహనాలపైన త్రైమాసిక పన్నుల రూపంలో ఎక్కువ మొత్తంలో ఆదాయం లభించింది. సుమారు 2.17 లక్షల వాహనాల నుంచి బకాయి ఉన్న రూ.230 కోట్ల త్రైమాసిక పన్ను వసూళ్ల కోసం ఆర్టీఏ చేపట్టిన ప్రత్యేక తనిఖీలు సత్ఫలితాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. కోవిడ్ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న అనేక వాహనాల నుంచి పన్నులు వసూలు చేశారు. పన్నులు, ఫీజులు తదితర రూపాల్లో ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా రూ.6,285 కోట్ల ఆదాయం లభించగా అందులో ఒక్క గ్రేటర్ హైదరాబాద్ నుంచి రూ.3,600 కోట్లకు పైగా రాబడి వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.